

# సాక్షి సంతకం

కామేశం కళ్ళు తెరిచి చూసేరికి చుట్టూ చీకటిగా ఉంది. కన్ను పొడుచుకున్నా ఏమీ కనపడటంలేదు. దూరంగా ఫ్యాక్టరీలోంచి మాత్రం మిణుకు మిణుకుమంటూ మిణుగురుల్లాంటి దీపాలు. ఆశగా అటుకేసి చూశాడు కామేశం. ఆ దీపాలు తమ జీవన జ్యోతులు. తమనూ, తమ కుటుంబాల్నీ ఆదుకుంటున్న దేవతా మూర్తులు. పిలిచి అన్నం పెడుతున్న మాతృమూర్తులు. అతనికి ఆ క్షణంలో పరిగెట్టి ఆ దీపాల నీడలో హాయిగా నిద్రపోవాలనిపించింది. ఆ దీపాల ఒడిలో కొంతసేపు సేద తీర్చుకోవాలనీ ఉంది. ఆ దీపాల కాంతిలో తమ జీవితాన్ని మరోసారి అందంగా చూసుకోవాలనీ అనిపించింది.

కామేశానికి ఆకలిగా ఉంది. అది బహుశా ఆకలి కాదేమో! ఆకలి వేసి వేసి చచ్చిపోయాక కలిగే నీరసం అయి ఉంటుంది. కామేశానికి ఆ క్షణంలో ఆశ్లేష గుర్తొచ్చింది. ఎంత అందమైన క్షణాలు అవి! ఆశ్లేష ఒడిలో హాయిగా పడుకొని జీవితాన్ని అందంగా, ఆనందంగా పంచుకొనే క్షణాలు!! పైనుంచి చందమామయ్య వెన్నెలలు వెచ్చగా పరుస్తోంటే, పక్కనే ఉన్న పరువాల పట్టుపరుపుమీద సుఖాలగనిని వెతుక్కొంటూ తొల్చుకొంటూ పోయే క్షణాలు!! పొగడచెట్టు కింద మంచంమీద నక్షత్రాలు రాలికింద పడుతున్నాయా అనిపించేలా చుక్కచుక్కగా పడే ఆ పొగడపూల మీద పాలసముద్రంలో నరహరిలా శయనించగలిగే క్షణాలు.

ఆ క్షణాలు గతంలోవి. బహుశా ఆ గతమూ ఇక రాదు. జీవితాన్ని అనుభవిస్తూ పోవటం అంటే బహుశా గతాన్ని జ్ఞాపకం చేసుకోవటమే కాబోలు!!

... చుట్టూ చూశాడు కామేశం. టెంట్‌లో వెలుగుతుండే దీపం ఆరిపోయిందిలా ఉంది. టెంటంతా చిక్కని చీకటి ఆవరించుకొంది. టెంట్‌లో ఏ వస్తువు ఎక్కడ ఉందో కొంచెం గుర్తుంది కాబట్టి నెమ్మదిగా పక్కమీంచి లేచాడు. తలగడ కింద పెట్టిన అగ్గిపెట్టె అందుకొని ఓ పుల్ల వెలిగించాడు. మధ్య తరగతి మందహాసంలా వెలిగింది ఆ వెలుగుదీపం. చిక్కని చీకట్లతో భీకరంగా పోరాడే యత్నాలు చేస్తోంది. ముసురుకొంటూ వస్తున్న చీకటి, దానికి తోడైన సన్నని గాలితెరలు, ఈ రెండూ ఒక్కసారిగా దాడి చేసేసరికి ఆ పోరాటంలో ఓడిపోయింది ఆ బలహీనపు అగ్గిపుల్ల.

ఆశగా మరోపుల్ల అందుకొన్నాడు. ఈసారి వెలిగింది. వణుకుతున్న చేతులతో హరికేన్ ముట్టించాడు.

చుట్టూ చీకటిని తిట్టుకొంటూ కూర్చోవటంకన్నా చిన్న దీపమైనా వెలిగించటం మంచిదట! తను ఇన్నాళ్ళకు చేసిందీ అదే!!

డేరాలో నెమ్మదిగా వెలుగు పరుచుకొంది. చుట్టూ చీకటి. ఆ కొంచెం స్థలంలో వెలుగు పరుచుకొంది. ఆ వెలుగులో చచ్చిన శవాల్లాంటి ఇద్దరు. ఆ ఇద్దరూ తనకు తోడు. ఈ వెలుగు చీకట్ల గతుకుబాటలో.

అయినా ఇది తను కోరి వరించిన బాటే! ఉద్యోగంలో చేరిన రోజున ఎంతో ఆకర్షణీయంగా కనపడింది ఫ్యాక్టరీ, ఈ ఫాక్టరీ తనది. ఇందులో తయారయ్యే ప్రతీ వస్తువూ తన శ్రమ తెలుపుతూనే ఉంటుంది. దేశాభివృద్ధికి తనూ తన చేతనయినంత చేస్తున్నాడనే తృప్తి కామేశంలో కలిగింది. ఆ మాటే సెక్షన్‌లో అన్నాడు.


అందరూ నవ్వారు.

విశ్వం ఒక్కడూ అన్నాడు: "మీరన్నది తప్పేమోనండీ ఈ ఫ్యాక్టరీలో వస్తువుల మాట వదిలెయ్యండి కానీ, అదుగో మేనేజ్‌మెంట్ వాళ్ళ ఇళ్ళు.. వాటి వెనుక మాత్రం మన శ్రమే కనపడాలి!"

కామేశం కొంచెం ఇబ్బందిగా కదిలాడు. విశ్వం అన్నది అంత సబబుగా కనపడలేదు అతనికి.

కానీ కాలం గడిచేకొద్దీ కామేశం, విశ్వం అభిప్రాయాలే సరి అయినవనుకునే స్థితికి వచ్చాడు. అపుడు కామేశానికి తన్నెవరో హత్య చేస్తున్నట్లుగా అనిపించింది. తను కలలుగన్న దేశం ఎటు పోతోందో అని తల్లడిల్లిపోయాడు.

టెంట్ వెనుక ఎవరో తచ్చాడినట్లుగా అనిపించింది. అటుకేసి చూసాడు కామేశం. వస్తున్న వ్యక్తి వెంకటరావు.



కామేశానికి నిన్న జరిగిన సంఘటన గుర్తొచ్చింది. తనతో ఉన్న వాళ్ళందరూ కొంచె ఎంగిలిపడటానికి ఇళ్ళకు వెళ్ళారు. కామేశం ఒక్కడూ పేపరు చదువుకొంటోంటే – ఆ పేపర్లో కామేశం గురించే ఉంది-వెంకటరావు వచ్చాడు. ఒక్కడూ రాక, కొన్ని దౌర్భాగ్యపు ఊహలు పోగు పోసుకొని తెచ్చాడు. మొదట అదీ ఇదీ అని చివరిగా అన్నాడు. "నేను మీ మేలుకోరేవాణ్ణి, అందుకని చెబుతున్నాను..."

"చెప్పండి" అన్నాడేకానీ నిజానికి వెంకట్రావు ఏం చెప్తాడో అర్థం అయిపోయింది. వెంకటరావు, తన్ను ఈ ఆదర్శాలకు నీళ్ళొదులుకోమని చెబుతున్నాడు. అంతే..

"మీరే చెప్పండి! మీరు ఆలోచిస్తున్నది పదిమంది గురించి! మరి, ఆ పదిమంది మీ గురించి ఏం ఆలోచిస్తున్నారో?"

"అలా ఆలోచిస్తే దాన్ని స్వార్థం అంటారు. 'నేను మీకిది చేస్తున్నా! మీరు నాకేం చేస్తున్నారు' అనడిగితే అది స్వార్థమే అవుతుంది!"

వెంకటరావు క్షణం ఆగి అన్నాడు : "మీరు చెప్పండి, ఫ్యాక్టరీ మూసి పది రోజులయింది. ఏం జరిగింది?"

"ఫ్యాక్టరీ మూసేయడం అనేది అనేది నా గెలుపుకాదు. రోజంతా ఒళ్ళు హూనం చేసుకొని బతికే మాకు కావాల్సింది ఎంగిలి మెతుకులుకావు. 'మీతోబాటు మమ్మల్నీ మా హక్కులు అనుభవించనివ్వండి!' అనడంలో తప్పేముంది? అది తప్పెందుకవుతుంది?"

"తప్పయింది అని కాదు, కానీ... అందరిలా కాకుండా, 'మీరు ప్రత్యేకంగా ఎందుకు ఉండాలి? అందరూ పోతున్నట్లు తలవంచుకొనే పోవచ్చు కదా! అయినా ఈ రోజు మీరు చేస్తున్న పని ఇంత క్రితం ఎందరో చేసి వదిలేసిందే! వాళ్ళంతా తెలివైన వాళ్ళు! అందుకనే ఈనాడు సుఖంగా ఉన్నారు".

కామేశానికి ఆ సంగతి తెలుసు కానీ వాళ్ళంతా స్వార్థజీవులు, పదిమంది కోసం బయలుదేరి, ఆ తర్వాత ఆ ఉద్యమాన్ని స్వార్థానికే ఉపయోగించుకొనే తోడేళ్ళు. వాళ్ళలాగా తనూ... ఊహూ..

"నా మాట విని ఈ నిరాహార దీక్ష మానేయండి. మీకు ఏ అన్యాయమూ జరక్కుండా చూసే బాధ్యత నాది!" అలా అని వెళ్ళిపోయిన వెంకటరావు జేబులోంచి నోట్లకట్ట ఒకటి తీసి మంచంమీద పెట్టాడు. ప్రకృతి అంతా ఒక్కసారి ఆ నోట్ల కట్టముందు నిలిచినట్టు అనిపించింది కామేశానికి!

"నన్ను ఇలా ఎందుకు అంచనా వేశారు?" బాధగా అన్నాడు కామేశం. "డబ్బుతో నన్ను నా ఆదర్శాలను వెలకట్టాలని ఎందుకనుకున్నారు?"

వెంకటరావు నెమ్మదిగా అన్నాడు, "వెలకట్టడం కాదు! కానీ... ప్రతి మనిషికి ఓ వెల అనేది ఉంది. కొందరు కాసులకైతే, మరి కొందరు కనకానికి! అంతే!!... మీరు తెలివైన వారు. తెలివైన నిర్ణయం తీసుకోండి. ఇది చూడండి! ఇవి చాలవనుకొంటే చెప్పండి. అంతేకానీ ఇలా ఆదర్శాలూ, ఆవేశాలు అనుకొంటూ ఉంటే..."

కామేశం నవ్వాడు: "ఈ సంగతి నిన్నే చెప్పి ఉంటే బాగుండేది. ఈ రోజు మీకు ఈ శ్రమ ఉండేదికాదు! వెళ్ళండి! ఈ సారి ఇలాంటి ఊహలతో ఇటుకేసి రాకండి".

వెంకటరావు వెళ్ళిపోయాడు. వెంకటరావు తనతోనే పని చేస్తాడు. అయినా తనను దీక్ష విరమణ చేయమని చెప్పడానికి వచ్చాడు, అదీ ఇలా పెడదారి తొక్కమంటూ! మనిషిని ఇంత తేలికగా ఎలా అంచనా వేస్తారు వీళ్ళు? ఆదర్శం అంటే గడ్డిపోచ విలువ లేదా?

అక్కడే పడుకొన్న ఇద్దరిలో ఒకతను కదిలాడు. నవ్వుతూ చెప్పాడు కామేశం. "వెంకటరావు వచ్చాడు. కూడా డబ్బులు తెచ్చాడు. ఈ దీక్ష మానమని"

అతను ఉలికి పడ్డాడు: "ఎంత ధైర్యం వీడికి! ఇలా పబ్లిక్‌గా అడుగుతాడా? కనుక్కొంటా ఉండండి" అంటూ చీకటిలో కలిసిపోయాడు వడివడిగా.

కామేశం కళ్ళు మూసుకొన్నాడు. కళ్ళముందుకొచ్చిన ఆశ్లేషా ఇదే అంది "ఎందుకొచ్చిన గొడవలండి ఇవి? ఎవరికీ లేని నిరాహార దీక్ష మీకెందుకు? సుఖాన ఉన్న ప్రాణాన్ని దు:ఖాన వేసుకోవటం తప్పు?"

కామేశం అనునయిస్తూ అన్నాడు.

"అందరూ అలానే అనుకొంటే ఎలా? ఎవరో ఒకరు ఎదుర్కొని తీరాలికదా!"

"అందరి కోసమూ మీరు కంకణం కట్టుకొంటారా ఏం?"

"మన ఇంటి సమస్య మనమే పరిష్కరించుకొంటాం. ఇదీ అంతే!!"

"కానీ ఈ నిరాహారదీక్ష..."

"ఊ, ఎంతకాలమనీ! ఇలాగే చచ్చిపోనుగా?"

"ఛ, అవే మాటలండీ, అయినా మనకొచ్చేది మనకు సరిపోతున్నప్పుడు. ఇంకెందుకీ గొడవలు?

కామేశం ఏమీ అనలేదు. ప్రతీ ఆడదీ సెల్ఫ్‌సెంటర్డ్ ఏమో! ఈ ఆడవాళ్ళకు ఏం చెప్పినా నచ్చచెప్పడం కష్టం.. అందుకే ఈ మౌనం.

...గడియారం మూడున్నర అయిందని చెబుతోంది ఇంకా చిక్కని చీకటి. ఎప్పటికి ఈ చీకట్లు వీడేను? ఎప్పటికి తెల్లవారేను?

❖ ❖ ❖

ఇంకో పదిరోజులు మౌనంగా ఆ టెంట్ చుట్టూ చూస్తూ వెళ్ళిపోయాయి.

ఆశ్లేష కళ్ళు వర్షించే మేఘాల్లా ఉన్నాయి. "చెప్పండి, ఇప్పటికే ఇరవై రోజులయిపోయింది. మిమ్మల్ని చూస్తోంటే..." మాటల్ని కళ్లు పూర్తి చేశాయి.

"మనిషిలో వ్యక్తిత్వాన్ని నిర్ణయించే గీటురాళ్ళు ఇలాంటి సమయాలే ఆశ్లేషా! పరీక్షకు నిలబడలేని వ్యక్తికి చరిత్రే ఉండదు... నాలోని ఆత్మవిశ్వాసానికి నువ్వు మరింత ప్రాణం పొయ్యాలే కానీ ఇలా బెంబేలు పడటం".

"మీకు తెలీదండీ మీరొక్కరే ఇలా ఆదర్శాలంటారే కానీ, మిగతా వాళ్ళకవి దూదిపింజల్లా ఎగిరిపోతాయి"

"ఏం జరిగింది? ఏం జరుగుతోంది??"

"ఇన్నాళ్ళూ మీకు తోడున్న రాజు రెండువేల రూపాయలు తీసుకొని..."

కామేశం మ్రాన్పడిపోయాడు- ఎందుకు ఇలా జరుగుతోంది? మనుషులు ఇలా ఎలా అయిపోతున్నారు? నడిసముద్రంలో తోటివాణ్ణి ఇలా ఎలా ముంచేయగలరు వీళ్ళు? తెలీదు.

అయినా ఇలా ఒకరిద్దరూ జారిపోయినంత మాత్రాన ఈ ఉద్యమం ఆగదు. తనొక్కడే... తను! ఒక్కడే అయినా చివరవరకూ పోరాడి... పోరాటం మనిషి చేతనానికి చిహ్నం, అంతేకానీ ఇలా మధ్యలో జారిపోవటం...

"వద్దండి! నామాట వినండి ఈ దీక్ష వదిలేసి..." ఆశ్లేష కళ్ళనిండా నీళ్ళు. కన్నీళ్ళతో తన్ను ఆకట్టుకొనే ప్రయత్నాలు. అయినా... జరుగుతున్న చరిత్రకు అడ్డం వేయాలనే ప్రయత్నం నెగ్గదు. కానీ... ఈ అడ్డంకులన్నిటినీ అధిగమించాలంటే, ఓ వ్యక్తి మిగతా అందరికంటే ఉన్నతుడై, ప్రాణాలను సైతం లెక్కచేయక పోరాడి తీరాలి! అప్పుడు నిద్రపోతున్న పదిమంది లేచి ఉద్యమంలోకి దూకి... అప్పుడే ఆదర్శాలకు విలువ, ఆత్మార్పణలకు విలువ!

కామేశం మనసులో ఓ కొత్త ఆలోచన తళుక్కున మెరిసింది. ఆ మెరుపులో అతనికి ఆశ్లేష గుర్తుకు రాలేదు!

❖ ❖ ❖

కామేశం నిరాహార దీక్ష ప్రారంభం అయి అప్పటికి సరిగ్గా నెల రోజులయింది. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయింది. కామేశం ఇంత క్రితం తీసుకొన్న నిర్ణయం ఆ రోజుకు మరింత బలం పుంజుకొని, ఆ రోజు కార్యరూపంలోకి మారబోతోంది.

సాయంత్రం నాలుగు గంటలకు కార్మికులందరినీ సమావేశం కమ్మని కోరాడు కామేశం. రావాల్సిన అందరూ వచ్చాక, ఒంట్లో లేని ఓపికను తనలోని లక్ష్యం సరఫరా చేస్తోంటే, కామేశం నెమ్మదిగా మాట్లాడసాగాడు. "ఇప్పటికే నెల అయింది నా నిరాహారదీక్ష ప్రారంభం అయి! కానీ కథలో చలనం లేదు. ఎందుకు ఫలితం లేకపోతోంది, అంటే దానికి కారణంగా కనిపించేవి మన నిర్లక్ష్య ధోరణి, మనలో మనకున్న వైషమ్యాలు, అవినీతి విధానాలు, మనల్ని వెన్నుపోటు పొడిచే తోటి కార్మికులు.

"ఎవర్ని నిందించను ఇంతమందిలో? ఎవరు కారణమని చెప్పను? కానీ మనలోని బలహీనతలు ఎదుటివారి విజయానికి బలం ఇస్తాయనేది నిజం. అందుకే మన దీక్ష విఫలమవుతోంది.

"మనం కోరేది, కోరిందీ స్వల్పం. మన కష్టాన్ని సరిగ్గా వెల కట్టమనటం తప్పేమీ కాదు! కార్మికుణ్ణి దోచే విధానం కొంత తగ్గించమన్నాం అంతే! మనం మన కోరికల్ని పెట్టుబడిగా పెట్టి ప్రారంభించిన ఈ ఉద్యమం ప్రాణాల్ని ఇచ్చైనా సరే నిలుపుకోవాలి. కోరిక సబబైనది కాకపోతే, విరమించుకోవటం మంచిది. కానీ మనం కోరేది న్యాయమనీ, సమంజసమనీ తెలిసిన మనం వెనక్కు పోవటం ఎందుకు? సగం చచ్చిన చావుకంటే నికృష్టమైన చావేలేదు.

"... ఆలోచించండి ఎక్కడ ఉంది లోపం? మన ఆశయసిద్ధి కోసం ప్రాణమొడ్డి పోరాడాల్సిన సమయం ఇది. కొందరి త్యాగంతో దీక్షబలపడితే, మన చిన్న చిన్న కోర్కెలు నెరవేరితే, అంతకన్నా కావాల్సింది ఏముంది? ఆ కొందరి త్యాగం, అది ప్రాణ త్యాగం అయినా, మరికొందర్ని ఈదారికి తెస్తే... అందుకే మీ అందరిలోనూ రావల్సిన ఆ మార్పుకోసం, ఆశయం అంటే ప్రాణాధికం అనే భావం మీలో కలగడానికి నా ప్రాణాల్ని నేను సమిధగా చేస్తున్నాను, మీరంతా మరోసారి మన ఆశయానికి కట్టుబడితే.. నాకంతే చాలు!" అంటూనే కామేశం టేబిల్‌కింద ఉన్న కిరసనాయిలు డబ్బా తన ఒంటిమీదకు వంచుకొని, ఆ తర్వాత అగ్గిపుల్ల...

అందరూ ఏం జరిగిందో ఆలోచించేలోపునే... ఏం జరుగుతుందో తెలుసుకొనే లోపునే... మంటలు... మంటలు...

మంటలన్నీ కామేశం మీదకు ఆకలిగా... అతనితోబాటుగా అతని ఆశయాలకు నిప్పంటుకొంది.

నిలువెత్తు మంటలు ఆదర్శాలకు, ఆత్మార్పణకు సాక్ష్యాలు!! ఆ మంటలన్నీ కామేశం శరీరం మీద ఈ కార్మిక లోకంలో జరుగుతున్న దారుణాలను చూస్తున్నట్లుగా సాక్షి సంతకాలు చేస్తున్నాయి.

ఇలా రాజుకొంటున్న మంటలు ఆరిపోకుండా ఉండాలి. కానీ, ఆ నిప్పు మాత్రం కామేశం శరీరాన్ని శవంగా మార్చగానే ఆరిపోయింది.

❖ ❖ ❖

నిజానికి ఈ కథ ఇక్కడే అయిపోవాల్సి ఉంది. కానీ... ఆ తర్వాత కామ్రేడ్ కామేశం శవంలో ఇంకా మిగిలిపోయిన ఆశయాలన్నిటికీ సకల లాంఛనాలతో దహన సంస్కారాలు జరిపారనీ... ఆశ్లేష జీవితం కొడిగట్టిపోయింది కనుక అది మళ్ళీ దారుణంగా వెలిగిపోవడానికి కార్మికులంతా తలో రూపాయి వేసి, ఆమెను ఆదుకొన్నారనీ... ఆ తర్వాత ఆ కార్మిక సంఘం సుఖంగా నిద్రపోయిందనీ... రచయితగా నేను కాకపోతే ఇంకెవరు చెబుతారు మీకు!

– స్వాతి, మే, *1978*